18

# శ్రీశేషుదేవులు బాప్తిస్మమిచ్చి ఇతరుల పాపాలను స్వీకరించేవారు

శ్రీ శేషుబాబు గారు ఎవరితో స్నేహం చేసినాగానీ చాలా నిష్కపటముగా ఉండేవారు. ఎటువంటి అరమరికలు లేకుండా తన విషయాలు స్నేహితులతో చెప్పేసేవారు. ఎప్పుడూ అబద్ధాలు ఆడేవారు కాదు. దాంతో ఆయనతో స్నేహం చేసేవారు కూడా తమలోని తప్పిదాలను ఆయనకు చెప్పేవారు. ఎవరైనా ఆయనకు తమలోని తప్పిదాలను చెబితే వాటిని ఏ విధంగా సరిచేసుకోవాలో పరిష్కారాన్ని ఆయన చెప్పేవారు. మనలో ఏ తప్పిదం ఉన్నా వాటిని దేవుని దగ్గర గానీ, గురువు, సత్పురుషుల దగ్గరగానీ చెప్పుకుంటే వాటివలన మనకు కలిగే నష్టం తొలగిపోతుంది. అయితే వాటిని తిరిగి చేయకూడదు. చేసిన తప్పుకు పశ్చాత్తాపపడాలి అని చెప్పేవారు. ఈ సందర్భంలోనే ఆయన ఒక సత్యవాక్యాన్ని చెప్పారు. అది "దూరంగా ఉండే అగ్నిపర్వతంలోని వేడివలన మనకు ఎటువంటి నష్టం లేదు. అయితే చేతిలో ఉండే నిప్పురవ్వ వల్లనే మనకు అధికమైన బాధ కలుగుతుంది. అలాగే మనకు దూరంగా ఉన్న చెడువ్యక్తుల వలన మనకు కలిగే హాని తక్కువ. అయితే మనలో ఉన్న చెడుతనమే మనల్ని ఎక్కువగా బాధిస్తుంది" అని చెప్పేవారు. కాబట్టి ముందుగా మనలోని చెడునే పొగొట్టుకోవాలి అని చెప్పేవారు. ఎవరైనా తమలోని చెడుగురించి చెబితే వారిని క్షమించడమే కాదు వారితో మరింతగా స్నేహం చేసి వారిలోని ఆ తప్పిదాలను తొలగించి మంచిమార్గంలోకి మార్చేవారు.

ఒకసారి ఒక స్నేహితుడు శ్రీ శేషుబాబు గారితో తనలో వావివరసలు లేని మానసిక వ్యభిచారములు, అసూయ, ద్వేషం, స్వార్థం, అహంకారం మొదలైనవి కలిగి ఉండి కూడా పైకి మాత్రం స్త్రీలవంక కన్నెత్తి కూడా చూడని బుద్ధిమంతుని లాగ నటిస్తున్నానని, తనలోని చెడ్డను కనిపించనీయకుండా పైకి అందరికి మంచివానిగా కనిపిస్తున్నానని చెప్పారు. శ్రీ శేషుబాబు గారు అతనిలో అలాంటి భావాలు ఉంటాయని ఊహించియుండలేదు. అసలు మనుష్యులలో అలాంటి భావాలు ఉంటాయనేదే అయనకు తెలియదు. ఆ తరువాత ఆయన ఇంటికి వెళ్ళి నిద్రపోతుండగా అతను చెప్పిన భావాలను గుర్తుకు తెచ్చుకుని వాటిని సహించలేక విపరీతమైన తలనొప్పి వచ్చేసి, నిద్రలో కెవ్వుమని కేక పెట్టేసారు. దానికి వారి తల్లిదండ్రులు గాభరా పడితే తలనొప్పి అని చెప్పినారే గానీ ఆ స్నేహితుని విషయాలేమి వారితో చెప్పలేదు. వెంటనే తల్లిదండ్రులు మంచిగంధం నూరి తలకు రాసి కట్టు కడితే కాస్త ఉపశమనం ఇచ్చింది. మతాచారము ప్రకారము బాప్తిస్మమిచ్చే బోధకులు కేవలం కర్మకాండగా

continue...

మాత్రమే ఆచరిస్తారు. కానీ సద్గురుదేవులగు శ్రీ శేషబాబు గారు ఆ వ్యక్తికి బాప్తిస్మమిచ్చుట ద్వారా ఆ పాపములను క్షమించుటయే గాక ఆ పాపభారమును తనపైకి స్వీకరించి తానే స్వయముగా అనుభవించేవారు. అప్పటి నుండి శ్రీ శేషబాబు గారి వద్ద ఎవరు బాప్తిస్మము పొందినా గానీ ఆయన దేహము పైకి అశాంతి వచ్చేసేది. బాప్తిస్మం పొందేవారి పాపభారం ఆయన మీద పడిపోయేది. దానివలన ఆయన అనవసరమైన చిన్న విషయాలకు కూడా అతిగా ఆలోచిస్తూ అశాంతిని కొనితెచ్చుకునేవారు. అలాగే లోకము నుండి అనవసరమైన నిందలు, విమర్శలు పొందుతూ దానివలన కూడా అశాంతిని కొని తెచ్చుకునేవారు. ఆ విధంగా ఇతరులలోని పాపభారాన్ని తాను అనుభవిస్తూ ఇతరులకు లాభాన్ని, శాంతిని ప్రసాదిస్తూ ఉండేవారు. శ్రీ శేషబాబు గారికి పుట్టుకతోనే ఆత్మవిమర్శ ఉండేది. ఏ చిన్న తప్పు చేసినా దానికి విపరీతంగా పశ్చాత్తాపపడి బాధను అనుభవించేవారు. అంతే కాకుండా ఆయన సత్వగుణుడు కావున ఇలాంటి చెడుభావాలు, చెడు విషయాలను తట్టుకోలేకపోయేవారు. ఆ వ్యక్తి యొక్క పాపయోచనల పాపభారం ఆత్మవిమర్శ కలిగివున్న ఆయనపై పడడం వలన ఆయన అశాంతి అనుభవించినారు. అయితే అప్పటి నుండి ఆ వ్యక్తితో మరింతగా స్నేహం చేస్తూ అతనిలోని తప్పులను తెలుసుకోవడం వాటిని ఏ విధంగా భగవంతుని దగ్గర పశ్చాత్తాపంతో చెప్పుకోవాలో చెప్పి, ఎలాంటి మంచికర్మలు, మంచి యోచనలు, మంచి పుస్తకాలు, మంచి సినిమాలు, మంచి సంభాషణలు కలిగివుండాలో చెప్పేవారు. దానితో ఆ వ్యక్తి యొక్క ప్రవర్తన పూర్తిగా మారిపోయి బాల్యము నుండి అప్పటి వరకు అతనికి ఉన్న అశాంతి, అనారోగ్య జీవితం తొలగిపోయి శాంతి, ఆరోగ్యం చేకూరేవి.

